సాక్షి ఆదిలాబాద్

ఆదివారం | 5 | జనవరి | 2025

ఇంద్రవెల్లి ఏఎంసీ నియామకం

ఇంద్రవెల్లి: ఇంద్రవెల్లి ఏఎంసీ చెర్మన్‌గా ముఖడే ఉత్తమ్, వైస్‌చైర్మన్‌గా సోయం మారుతిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు ప్రకటనలో తెలిపారు. సభ్యులుగా జంగు, అచ్యుత్‌రావ్, గణేశ్, మానిక్‌రావ్, పరుశురాం, ఆనంద్‌రావ్, సుమన్‌బాయి, ఇంద్రబాయి, శ్రీకాంత్, ప్రకాశ్, కైలాస్‌ను నియమించినట్లు తెలిపారు.



సంక్రాంతికి ప్రత్యేక బస్సులు

సంక్రాంతి సందర్భంగా ప్రయాణికుల సౌకర్యార్థం టీజీఆర్టీసీ ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది. రద్దీ దృష్ట్యా స్పెషల్ బస్సులు నడపాలని నిర్ణయించింది. 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 28.0/11.0

వాతావరణం పొడిగా ఉంటుంది. చలి ప్రభావం పెరగనుంది. వేకువజామున పొగ మంచు ప్రభావం కనిపిస్తుంది.

న్యూస్‌రీల్

కళ్లకు గంతలతో నిరసన



కళ్లకు గంతలతో నిరసన తెలుపుతున్న హమాలీ కార్మికులు

కైలాస్‌నగర్: పెంచిన కూలి రేట్ల జీవో వెంటనే అమలు చేయాలని హమాలీలు చేస్తున్న సమ్మె నాలుగో రోజుకు చేరింది. సివిల్ సప్లయ్ గోడౌన్ ఎదుట హమాలీలు చేపట్టిన సమ్మెలో భాగంగా శనివారం కళ్లకు గంతలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్ మాట్లాడారు. హమాలీలు నాలుగు రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం విచారకరమన్నారు. ఇచ్చిన హామీలతో పాటు ఒప్పందాలు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అప్పటి వరకు సమ్మె కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఇందులో ఏఐటీయూసీ డిప్యూటి ప్రధాన కార్యదర్శి రాజు, యునియన్ నాయకులు సలీం, మోసిన్, రాజేందర్, రమేశ్, పొచ్చన్న తదితరులు పాల్గొన్నారు.

25వ రోజుకు 'సమగ్ర' నిరసన

- 'కంది' కార్యాలయం ముట్టడించిన ఉద్యోగులు



బైఠాయించి నినాదాలు చేస్తున్న ఉద్యోగులు

కైలాస్‌నగర్: తమకు ఉద్యోగ భద్రత కల్పించాలనే డిమాండ్‌తో సమగ్ర శిక్ష ఒప్పంద ఉద్యోగులు చేపట్టిన సమ్మె కొనసాగుతోంది. 25వ రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడాన్ని నిరసిస్తూ ఉద్యోగులు శనివారం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయాన్ని ముట్టడించారు. కలెక్టరేట్ ఎదుట గల సమ్మె శిబిరం నుంచి క్యాంపు కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి బైఠాయించారు. కంది అందుబాటులో లేకపోవడంతో వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ ఫోన్ ద్వారా ఉద్యోగ సంఘ నాయకులతో మాట్లాడించారు. వారి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇవ్వడంతో వారు శాంతించారు. కార్యక్రమంలో పడాల రవీందర్, ప్రియాంక, ధరంసింగ్, కేశవ్, శ్రీకాంత్, అర్చన, వెంకటి, భోజన్న, రాజన్న, మమత తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్లకు కంటి చూపు కీలకం



మాట్లాడుతున్న డీటీసీ రవీందర్‌కుమార్

ఆదిలాబాద్‌టౌన్: వాహనాలు నడిపే ప్రతి ఒక్కరికి కంటి చూపు ఎంతో అవసరమని డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ వి.రవీందర్ కుమార్ అన్నారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా దుర్గం ట్రస్టు ఆధ్వర్యంలో స్కూల్ బస్సు డ్రైవర్లకు శనివారం నేత్రవైద్య శిబిరం నిర్వహించారు. ఆర్టీవో కార్యాలయంలో నిర్వహించిన శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. స్కూల్ పిల్లలను తీసుకెళ్లే డ్రైవర్లకు కంటి చూపు ఎంతో అవసరమన్నారు. లేకుంటే ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ రహదారి భద్రత నియమాలు పాటించాలని సూచించారు. ఇందులో ఆర్టీసీ ఆర్‌ఎం సోలోమన్, ఎంవీఐ శ్రీనివాస్, ఏఎంవీఐలు హరిందర్, రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్, తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులకు పూలు, చాక్లెట్లు అందించి..

ఇదిలా ఉంటే పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాల విద్యార్థులు ట్రాఫిక్ నియమాలపై వాహనదారులకు అవగాహన కల్పించారు. కలెక్టరేట్ చౌరస్తాలో వాహనదారులకు పూలు, చాకెట్లు అందిస్తూ ట్రాఫిక్ నియమాలు పాటించాలని కోరారు. ట్రాఫిక్ సీఐ ప్రణయ్, తదితరులు పాల్గొన్నారు.



సన్మాన గ్రహీతలతో కలెక్టర్ రాజర్షి షా

రూ.110 వేతనంతో..

అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల ప్రస్థానం

- సుమారు అర్ధ శతాబ్దంపాటు సేవలు
- వయోభారంతో పలువురికి గతేడాది రిటైర్‌మెంట్
- ఇటీవల ప్రభుత్వం నుంచి రూ.లక్ష ప్రయోజనం అందజేత



ఇందులో కనిపిస్తున్న మహిళ కే.రాధ. 42 ఏళ్లుగా అంగన్‌వాడీ టీచర్‌గా సేవలందించారు. 65 ఏళ్లు నిండిన వారికి ప్రభుత్వం పదవీ విరమణ కల్పించడంతో గతేడాది జూన్‌లో ఈమె రిటైర య్యారు. ఈమెలాగే ఆదిలాబాద్ జిల్లాలో 50 మంది టీచర్లు, 144మంది ఆయాలు తమ సేవలకు గుడ్‌బై చెప్పారు. ఇటీవల ప్రభుత్వం అందులో కొంత మందికి బెనిఫిట్ కింద రూ.లక్ష ఆర్థికసాయం అందజేసింది. మరికొంత మందికి అందజేయాల్సి ఉంది. ఇన్నాళ్లు అంగన్‌వాడీతో విశేష అనుబంధం ఉన్న వారు ఆ ఎడబాటును మరిచిపోలేకపోతున్నారు.

సండే స్పెషల్



సుందరయ్యనగర్ అంగన్‌వాడీ టీచర్‌కు కేంద్రం వద్ద ఆత్మీయ వీడ్కోలు పలుకుతున్న కాలనీవాసులు

సాక్షి, ఆదిలాబాద్: అవిభాజ్య ఆంధ్రప్రదేశ్‌లో 1976 వ సంవత్సరంలో రాయలసీమలోని కంబతూరు, తెలంగాణలోని ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్‌లో అంగన్‌వాడీ సెంటర్‌ను కేంద్ర ప్రభుత్వం తొలుత మంజూరు చేసింది. ఇవే మొదటి సెంటర్లు. అప్పటికి ఏజెన్సీ ప్రాంతం కూడా ఏర్పడలేదు. ప్రధానంగా వెనుకబడిన జిల్లాలుగా పరిగణలోకి తీసుకుని కేంద్రం ఈ రెండు సెంటర్లను మంజూరు చేసింది. ఐసీడీఎస్‌కు అనుబంధంగా పనిచేసే ఈ అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు మొదట పాలు, ఉప్మా ఇవ్వడం ద్వారా ప్రారంభించిన సేవలను ఆ తర్వాత కాలంలో క్రమంగా విస్తరించారు. 1982 నుంచి అన్ని చోట్ల ఈ కేంద్రాలు ఏర్పాటవుతూ వచ్చాయి. అర్బన్ ప్రాంతాల్లోనూ ప్రధానంగా మురికివాడలను పరిగణలోకి తీసుకుని ప్రాజెక్టులను ఏర్పాటు చేశారు. పోషకాహార లోపంతో గర్భిణులు, బాలింతలు, చిన్నారులు మృతి చెందవద్దనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం వందశాతం ఖర్చు భరించేలా వీటిని రూపొందించింది. ఉట్నూర్‌లో అప్పట్లో రూ.110కి చేరిన వారు కూడా ఇప్పుడు రిటైర్డ్ అయిన వారిలో ఉన్నారు. ప్రస్తుతం అంగన్‌వాడీ టీచర్ల వేతనం రూ.13,650కి చేరుకుంది. ఆయాలకు రూ.7,800 చెల్లిస్తోంది. తక్కువ వేతనంతో అయినప్పటికీ ప్రభుత్వ పరంగా అనేక సంక్షేమ పథకాల అమల్లో భాగస్వాములవుతూ అంగన్‌వాడీలు తలలో నాలుకలా ప్రభుత్వానికి అండగా నిలుస్తూవచ్చారు. పదవీ విరమణ చేసిన అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలను శనివారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ రాజర్షి షా సన్మానించారు.

అంగన్‌వాడీల ఉన్నతీకరణ నేపథ్యంలో...

అంగన్‌వాడీలను ప్రీ మోడల్ స్కూల్స్‌గా మార్చాలని కాంగ్రెస్ ప్రభుత్వం యోచనలో ఉంది. ఇందులో భాగంగా 65 ఏళ్లు నిండిన వారికి పదవీ విరమణ కల్పించాలని నిర్ణయించి అమలు చేసింది. ఇలా ఏర్పడిన ఖాళీలను రానున్న రోజుల్లో కొత్త నోటిఫికేషన్ల ద్వారా భర్తీ చేయాలని భావిస్తోంది. అంగన్‌వాడీ టీచర్ పోస్టుకు ఇప్పటికే ఇంటర్ అర్హతగా నిర్ణయించారు. ప్రధానంగా అన్ని అంగన్‌వాడీ కేంద్రాలను అప్‌గ్రేడ్ చేయడంతో ప్రస్తుతం మినీ అంగన్‌వాడీలనే ప్రత్యేకత లేదు. టీచర్ పోస్టు మాత్రమే రానున్న రోజుల్లో మిగలనుంది. మొత్తంగా రానున్న రోజుల్లో అంగన్‌వాడీ కేంద్రాలు మరింత పటిష్టం కానున్నాయి.

వృత్తి నిబద్ధతతో పనిచేస్తేనే గుర్తింపు

ఆదిలాబాద్‌టౌన్: వృత్తి నిబద్ధతతో పనిచేసే వారికి సమాజంలో తగిన గుర్తింపు ఉంటుందని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేసి ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన టీచర్లు, ఆయాలను కలెక్టర్ సన్మానించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అంగన్‌వాడీ టీచర్లు గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని సూచించారు. పిల్లలు విస్మరించే తల్లిదండ్రులను ఆర్డీవో వద్దకు తీసుకెళ్లి ఫిర్యాదు చేయించేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. 18 మంది టీచర్లు, ఆయాలను పూలమాల, శాలువాలతో ఘనంగా సత్కరించారు. వారు చేసిన సేవలను కొనియాడారు. ఇందులో జిల్లా సంక్షేమాధికారి సబిత, ఏసీడీపీఓ మిల్కా, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు సంద అశోక్, అంగన్‌వాడీ కార్యకర్త కె.రాధ, సునంద, కవిత, వందన, సుజాత, అనిత తదితరులు పాల్గొన్నారు.

'ఆరోగ్య పాఠశాల'తో విద్యార్థుల్లో మార్పు

- కలెక్టర్‌కు వివరించిన హెచ్‌ఎంలు



ఆరోగ్య వైకుంఠపాళిని కలెక్టర్‌కు వివరిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయుడు

కైలాస్‌నగర్: ఆరోగ్య పాఠశాల ద్వారా విద్యార్థులు, వారి తల్లిదండ్రుల అలవాట్లలో మార్పు వస్తుందని పలువురు హెచ్‌ఎంలు, స్టూడెంట్ ఛాంపియన్లు వివరించారు. ఆరోగ్య పాఠశాల మూడో సమీక్షా సమావేశం కలెక్టరేట్ సమావేశ మందిరంలో శనివారం నిర్వహించారు. జిల్లాలోని 43 పాఠశాలల నుంచి వచ్చిన స్టూడెంట్ ఛాంపియన్లు, హెచ్‌ఎంలు తమ పాఠశాలల్లో ఆరోగ్య పాఠశాల ద్వారా చేపడుతున్న కార్యక్రమాల వివరాలు, వాటితో కలిగిన ప్రయోజనాలను కలెక్టర్‌కు వివరించారు. ముఖ్యంగా పాఠశాలల్లో చదువుతున్న కొంతమంది పిల్లలు గుట్కా, తంబాకు, సిగరెట్ తాగడం వంటి చెడు వ్యసనాలను మానేశారని చెప్పారు. తల్లిదండ్రుల్లోనూ ఇలాంటి మార్పే కోరుతున్నట్లుగా పిల్లలు కలెక్టర్‌కు తెలిపారు. ఈ ఏడాది చివరి నాటికి తన తండ్రితో చెడు వ్యసనాలను పూర్తిగా మానివేయిస్తానని గుడిహత్నూర్ మోడల్ స్కూల్ స్టూడెంట్ ఛాంపియన్ తెలిపారు. వినూత్నంగా వైకుంఠపాళిలో ఆరోగ్య పాఠశాల పూర్తి సమాచారాన్ని పొందుపరిచి పిల్లలతో ఆటలాడించి కార్యక్రమ అంశాలను అవగాహన కల్పిస్తున్నామని బేల మండలం సిరిసన్న పాఠశాల టీచర్లు తెలిపారు. జెడ్పీహెచ్ఎస్ తోశం పాఠశాలలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అనుసంధానంతో పాఠ్యాంశాలను బోధిస్తున్నామని తద్వారా సమయాన్ని తగ్గించడమే కాకుండా పిల్లలు ఆసక్తికరంగా నేర్చుకుంటున్నారని హెచ్‌ఎం గోపాల్ సింగ్ తిలావత్, సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు సంతోష్ పేర్కొన్నారు. అనంతరం స్టూడెంట్ ఛాంపియన్ విద్యార్థులకు కలెక్టర్ సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో డీఈవో ప్రణీత, ఆరోగ్య పాఠశాల అనుసంధానకర్త అజయ్ తదితరులు పాల్గొన్నారు.

శిశు మరణాలు నియంత్రించేలా సేవలందించాలి

జిల్లాలో శిశు మరణాల (ఐఎంఆర్)ను నియంత్రించేలా వైద్యులు, ఆరోగ్య సిబ్బంది మరింత మెరుగైన సేవలందించాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. ఐదేళ్లలోపు శిశు మరణాల నియంత్రణపై కలెక్టరేట్ సమావేశ మందిరంలో వైద్యులు, ఆరోగ్య సిబ్బందితో శనివారం సమీక్ష నిర్వహించారు. గతేడాది ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో నమోదైన శిశు మరణాలపై సంబంధిత మెడికల్ ఆఫీసర్లు, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లను అడిగి వివరాలు తెలుసుకున్నారు. కారణాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శిశు మరణాలు జరగకుండా ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలన్నారు. వాటిని నివారించేందుకు వైద్య ఆరోగ్యశాఖ ద్వారా తగు చర్యలు చేపట్టాలని డీఎంహెచ్‌వోను ఆదేశించారు. గర్భిణులు రెగ్యులర్‌గా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడంతో పాటు పౌష్టికాహారం తీసుకునేలా చైతన్యపర్చాలన్నారు. ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచాలని ఆదేశించారు. ఇందులో డీఎంహెచ్‌వో రాథోడ్ నరేందర్, అదనపు డీఎంహెచ్‌వో మనోహర్, డిప్యూటీ డీఎంహెచ్‌వో సాధన, డీఐవోవైసీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకు చేరిన ఓటర్ల తుది జాబితా



జాబితాను సరిచూసుకుంటున్న ఉద్యోగులు

కైలాస్‌నగర్: ఓటరు జాబితా సంక్షిప్తసవరణ- 2025లో భాగంగా రూపొందించిన జిల్లా ఓటర్ల తుది జాబితాను ఈసీ ఆదేశాలకు అనుగుణంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఈనెల 6న ప్రకటించనున్నారు. ఈ నేపథ్యంలో ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గాలకు సంబంధించిన ఓటరు జాబితాలు జిల్లా కేంద్రానికి చేరాయి. వాటిని కలెక్టరేట్ సమావేశ మందిరంలో భద్రపర్చిన అధికారులు గ్రామాల వారీగా సిద్ధం చేసిన జాబితాలను శనివారం రెవెన్యూ ఉద్యోగులకు అందజేశారు. వీటిని ఆర్డీవో, సబ్ కలెక్టర్ కార్యాలయాలతో పాటు జిల్లాలోని అన్ని తహసీల్దార్ కార్యాలయాలు, పోలింగ్ కేంద్రాల్లో ఈ నెల 6న ప్రదర్శించనున్నారు. బీఎల్‌వోల వద్ద కూడా అందుబాటులో ఉంచనున్నారు.

టెండర్లు ఖరారు



త్వరలో బీటీగా మారనున్న బీసీ స్టడీ సర్కిల్ నుంచి కేఆర్‌కే కాలనీకి వెళ్లే రోడ్డు

- 'టీయూఎఫ్ఐడీసీ' పనులు దక్కించుకున్న ఓ సంస్థ..
- జిల్లా కేంద్రంలో రూ.10.50 కోట్లతో పలు అభివృద్ధి పనులు

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ మున్సిపాలిటీకి తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీయూఎఫ్ఐడీసీ)ద్వారా మంజూరైన పనుల టెండర్లు ఎట్టకేలకు ఖరారయ్యాయి. రూ.10.50 కోట్ల వ్యయంతో చేపట్టనున్న వివిధ రకాల అభివృద్ధి పనులను వరంగల్ జిల్లాకు చెందిన ఓ సంస్థ దక్కించుకుంది. దీంతో త్వరలోనే ఈ పనులు ప్రారంభించే అవకాశముంది. అయితే నిధుల లేమితో కొంతకాలంగా పట్టణంలో అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. సర్కారు నిర్ణయంతో ఇక ఆయా కాలనీల్లో రోడ్లు, డ్రెయినేజీలు మెరుగుపడనున్నాయి.

బీజేపీ కౌన్సిలర్ల వార్డులకు ప్రాధాన్యత

మున్సిపల్ కౌన్సిల్ కాల పరిమితి మరో 20 రోజుల్లో ముగియనుంది. ఈ నేపథ్యంలో టీయూఎఫ్ఐడీసీ కింద మంజూరైన పనుల టెండర్ల ప్రక్రియ పూర్తి కావడం కౌన్సిలర్లకు కొంత ఊరట కలిగించినట్లయింది. ఐదేళ్ల పాటు పదవిలో కొనసాగినా పలువురు కౌన్సిలర్లకు నిధుల కేటాయింపనేది పెద్దగా జరగలేదు. తాజాగా మంజూరైన పనుల్లో అలాంటి కౌన్సిలర్లకు ప్రాధాన్యత దక్కింది. ఈ నిధులతో తమ వార్డుల్లో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సీసీరోడ్లు, డ్రైనేజీలను నిర్మించుకునే వెసులుబాటు కలగనుంది. ఈ నిధుల కేటాయింపులో బీజేపీ కౌన్సిలర్లకు అత్యంత ప్రాధాన్యతనిచ్చారు. నాలుగేళ్ల పాటు విపక్షసభ్యులుగా కొనసాగగా వారి వార్డులకు అంతగా నిధులు మంజూరుకాలేదు. ఈ క్రమంలో గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీ అభ్యర్థి ఎమ్మెల్యేగా గెలుపొందిన నేపథ్యంలో తమ పార్టీ కౌన్సిలర్ల వార్డులకు అధికనిధులు కేటాయించడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. మొన్నటి వరకు బీఆర్ఎస్‌లో కొనసాగి ఇటీవల బీజేపీలో చేరిన కౌన్సిలర్ల వార్డులకు సైతం పెద్ద మొత్తంలో నిధులు కేటాయించడం ఆసక్తి కలిగిస్తోంది.

రూ.10.50 కోట్లతో పనులు

ప్రభుత్వం టీయూఎఫ్ఐడీసీ ద్వారా ఆదిలాబాద్ పట్టణాభివృద్ధి కోసం రూ.10.50 కోట్లను మంజూరు చేసింది. తొలుత రూ.5.40 కోట్లను కేటాయించగా మరోసారి రూ.5.10 కోట్లను మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిధులతో ఆయా వార్డుల్లో చేపట్టనున్న సీసీ రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణ పనులకు సంబంధించిన టెండర్ల ప్రక్రియను హైదరాబాద్‌లోని ఈఎన్‌సీ కార్యాలయంలో నిర్వహించారు. వరంగల్ జిల్లాకు చెందిన ఓ సంస్థ టెండర్ దక్కించుకుంది. పట్టణంలోని పలు వార్డుల్లో ఈ నిధులతో సీసీ రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణాలు చేపట్టనున్నారు. పూర్తిగా గుంతలమయంగా మారిన దస్నాపూర్ నుంచి కేఆర్‌కే కాలనీకి వెళ్లే రోడ్డును బీటీగా మార్చేందుకు రూ.1.95లక్షలను కేటాయించారు. సర్వే నంబర్ 170లోని పోచమ్మ మందిరం నుంచి వివేకానందచౌక్ దిశగా అగ్రజాటౌన్‌షిప్ వరకు బీటీ రోడ్డు నిర్మించేందుకు గాను రూ.1.60 కోట్లను కేటాయించారు. అలాగే మహాలక్ష్మివాడ ఆర్‌యూబీ నుంచి తాటిగూడ పార్కు వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.85లక్షలు మంజూరు చేశారు. ప్యాకేజీ-1లో రూ.5.40 కోట్లతో అత్యధికంగా బీటీ రోడ్లనే ప్రతిపాదించగా ప్యాకేజీ-2లో రూ.5.10 కోట్లతో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించేలా ప్రతిపాదించారు. ఈ పనులకు కలెక్టర్ ఆమోదముద్ర వేయగా తాజాగా టెండర్ల ప్రక్రియ కూడా పూర్తయింది. త్వరలోనే పనులు ప్రారంభించే అవకాశముంది. పదవీ కాలం ముగింపు దశలో నిధులు కేటాయింపుతో ఆయా వార్డుల కౌన్సిలర్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పనులు త్వరితగతిన ప్రారంభించి నాణ్యతతో చేపట్టేలా చూడాలని వారు కోరుతున్నారు.

త్వరలోనే పనులు ప్రారంభం

టీయూఎఫ్ఐడీసీ నిధులకు సంబంధించి రూ.10.50 కోట్ల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు టెండర్లు ఖరారయ్యాయి. వరంగల్‌కు చెందిన ఓ సంస్థ దక్కించుకుంది. త్వరలోనే పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుని నాణ్యతతో చేపట్టేలా శ్రద్ధ వహిస్తాం. ఆయా వార్డుల్లో సమస్యల ఆధారంగా ప్రాధాన్యత క్రమంలో నిధులను కేటాయించాం.

– తిరుపతి, డీఈ, ఆదిలాబాద్

శాంతిభద్రతల పరిరక్షణే ప్రధాన కర్తవ్యం

- ఎస్పీ గౌస్ ఆలం
- సిరిచెల్మలో పోలీసుల ఆధ్వర్యంలో వైద్యశిబిరం



మాట్లాడుతున్న ఎస్పీ గౌస్ ఆలం

ఇచ్చోడ: శాంతిభద్రతల పరిరక్షణే పోలీసుల ప్రధాన కర్తవ్యమని ఎస్పీ గౌస్ ఆలం అన్నారు. మండలంలోని సిరిచెల్మలో పోలీసుల ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన వైద్యశిబిరానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మారుమూల గ్రామాల్లో ఉంటున్న ఆదివాసీ, గిరిజనుల కష్టసుఖాల్లో పోలీసులు పాలు పంచుకుంటున్నారని తెలిపారు. ఉట్నూర్ ఏఎస్పీ కాజల్ సింగ్ మాట్లాడుతూ, గిరిజన ప్రాంతాల్లో పోలీసుశాఖ ద్వారా సేవ చేయడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం ఆయా గ్రామాల నుంచి తరలివచ్చిన వారికి వైద్యులు పరీక్షలు నిర్వహించారు. అలాగే హైదరాబాద్ రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో రెండు వేల మందికి దుప్పట్లు పంపిణీ చేశారు. పలువురు విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో డీఎస్పీ నాగేందర్, సీఐ భీమేశ్, ఎస్సైలు తిరుపతి, శ్రీకాంత్, మహేందర్, రోటరీ క్లబ్ అధ్యక్షులు చిత్ర, పోలీసులు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నియంత్రణ అందరి బాధ్యత

- కలెక్టర్ రాజర్షి షా



ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్, డీటీసీ, డీఎస్పీ

ఆదిలాబాద్‌టౌన్: రోడ్డు ప్రమాదాల నియంత్రణను ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా భావించాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా రవాణాశాఖ ఆధ్వర్యంలో శనివారం ఆటో ర్యాలీ చేపట్టారు. స్థానిక బస్టాండ్ వద్ద ర్యాలీని కలెక్టర్ ప్రారంభించగా.. పట్టణంలోని ప్రధాన వీధుల గుండా సాగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాల నివారణ కోసం జనవరి 1నుంచి 30వరకు సడక్ సురక్ష అభియాన్ పర్వ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. చిన్న చిన్న అంశాలను గుర్తించినప్పుడే ప్రమాదాలను నివారించుకోగలమన్నారు. పట్టణంలోని బ్లాక్‌స్పాట్స్‌ను గుర్తించి అక్కడ రంబల్ స్ట్రిప్స్, స్పీడ్ బ్రేకర్స్ వంటివి ఏర్పాటు చేస్తామన్నారు. అలాగే ట్రాఫిక్, రహదారి నిబంధనలపై ప్రతీ పాఠశాలలో పోటీలతో పాటు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ పి.రవీందర్ కుమార్, ఆర్టీసీ ఆర్‌ఎం సోలోమన్, డీఎం కల్పన, ఎంవీఐ శ్రీనివాస్, డీఎస్పీ జీవన్ రెడ్డి, ఏఎంవీఐలు, తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ చలి పంజా

- జిల్లాలో పడిపోతున్న కనిష్ట ఉష్ణోగ్రతలు
- భీంపూర్‌లో 6.2 డిగ్రీలుగా నమోదు



చలికి తట్టుకోలేక దుప్పటి కప్పుకున్న కార్మికుడు

ఆదిలాబాద్‌టౌన్/బోథ్: జిల్లాలో మళ్లీ చలిపులి పంజా విసురుతోంది. రెండు రోజులుగా కనిష్ట ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. శనివారం జిల్లాలో భీంపూర్ మండలంలో 6.2 డిగ్రీలుగా నమోదైంది. బేలలో 6.9, జైనథ్, మావలలో 7.5, బోథ్‌లో 8.1, తాంసిలో 8.7, ఆదిలాబాద్ రూరల్‌లో 8.8 ,నేరడిగొండలో 9డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. వారం క్రితం వరకు కనిష్ట ఉష్ణోగ్రతలు 15నుంచి 18 డిగ్రీలుగా ఉండగా రెండు మూడు రోజులుగా వాతావరణంలో చోటు చేసుకున్న మార్పులతో క్రమంగా పడిపోయాయి. వేకువజామున, రాత్రి వేళల్లో చలి తీవ్రత పెరుగుతోంది. దీంతో ఉదయం వివిధ పనులకు వెళ్లే వారు ఇబ్బందులకు గురవుతున్నారు.

క్లుప్తంగా

కడుపునొప్పి భరించలేక యువకుడి ఆత్మహత్య


మహేశ్ (ఫైల్)

దండేపల్లి: కడుపునొప్పి భరించలేక యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై ఉదయ్‌కిరణ్ కథనం ప్రకారం ..మండలంలోని వెల్గనూర్ గ్రామానికి చెందిన మెండ మహేశ్ (24) గత రెండేళ్ల క్రితం నుంచి కడుపునొప్పితో బాధపడుతున్నాడు. కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగా లేనందున పెద్ద ఆసుపత్రిలో చూపించలేదు. దీంతో తరచూ కడుపునొప్పితో బాధపడేవాడు. ఈక్రమంలో నొప్పి భరించలేక శుక్రవారం గ్రామ పంచాయతీ భవనం సమీపంలో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు లక్సెట్టిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం మంచిర్యాల ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. రాత్రి పరిస్థితి విషమించడంతో వరంగల్ ఎంజీఎంకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. తల్లి పద్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

బైక్ పైనుంచి పడి కార్మికుడు మృతి


రాజేశ్ (ఫైల్)

శ్రీరాంపూర్: అదుపుతప్పి బైక్‌పై నుంచి పడి సింగరేణి కార్మికుడు మృతి చెందాడు. సీసీసీ నస్పూర్ ఎస్సై సుగుణాకర్ కథనం ప్రకారం.. తీగల్‌పహాడ్ ఏరియాలోని అల్లూరిసీతారామరాజునగర్‌లో నివాసం ఉండే గడికొప్పుల రాజేశ్(32) ఆర్కే 6 గనిలో జనరల్ మజ్దూర్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం సాయంత్రం బెల్లంపల్లిలోని మిత్రుడు వద్దకు వెళ్లి కలిసి తన బైక్‌పై ఇంటికి బయల్దేరాడు. అర్ధరాత్రి ఎన్‌హెచ్ 363 సీసీసీ నస్పూర్ ఫ్లైఓవర్ నుంచి సర్వీసు రోడ్డుకు దిగుతూ బైక్ అదుపుతప్పి కాలువలో పడ్డాడు. తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. శనివారం హైవే పెట్రోలింగ్ సిబ్బంది చూసి పోలీసులకు సమాచారం అందించారు. వారు వెళ్లి చూసే అప్పటికే మృతి చెందాడు. మృతుడి తండ్రి ఇసయ్య ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో పత్తి దగ్ధం


దగ్ధమైన పత్తి

నెన్నెల: మండలంలోని కోణంపేట గ్రామంలో శనివారం రాత్రి షార్ట్ సర్క్యూట్‌తో నిల్వ ఉన్న పత్తి దగ్ధమైంది. మాజీ సర్పంచ్ డోలే చిన్నక్క సుమారు 25 క్వింటాళ్ల పత్తిని ఇంట్లో నిల్వ చేసుకుంది. షార్ట్ సర్క్యూట్ కావడంతో నిప్పురవ్వలు చెలరేగి నిల్వ పత్తిపై పడటంతో మంటలు వ్యాపించాయి. చుట్టుపక్కల వారు అప్రమత్తమై నీటిని చల్లి మంటలార్పివేశారు. రోడ్డు సరిగా లేకపోవడంతో ఫైర్ సిబ్బంది అక్కడికి చేరుకోలేకపోయారు. సిబ్బంది నడుచుకుంటూ వెళ్లి అక్కడి యువకులు, ప్రజలతో కలిసి మంటలార్పి వేశారు. ప్రమాదంలో దాదాపు రూ.10 క్వింటాళ్ల వరకు పత్తి దగ్ధం కాగా, రూ.60 వేల వరకు నష్టం వాటిల్లిందని చిన్నక్క ఆవేదన వ్యక్తం చేసింది. అధికారులు స్పందించి పరిహారం అందేలా చూడాలని కోరింది.

సంక్రాంతికి ప్రత్యేక బస్సులు

- ఈనెల 7 నుంచి 13 వరకు..
- ఆదిలాబాద్ రీజియన్ పరిధిలో 290 సర్వీసులు
- 15 నుంచి 20 వరకు జేబీఎస్‌కు తిరుగు ప్రయాణం
- 195 బస్సులను సిద్ధం చేసిన ఆర్టీసీ



మంచిర్యాలఅర్బన్: సంక్రాంతి సందర్భంగా సొంతూళ్లకు వెళ్లేవారి కోసం టీజీఆర్టీసీ ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది. ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చేందుకు బస్సులు నడపాలని నిర్ణయించింది. ఆదిలాబాద్ రీజియన్‌లో ఆయా డిపోల బస్సులను జేబీఎస్ నుంచి 7 నుంచి 13 వరకు 290 ప్రత్యేక బస్సులు నడపనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యాసంస్థలకు ఈనెల 11 వరకు సెలవులు ప్రకటించడం, హైదరాబాద్‌కు వ్యాపార, ఉద్యోగరీత్యా వెళ్లినవారు.. చదువుల నిమిత్తం ఉన్న విద్యార్థులందరూ పండుగకు సొంతూళ్లకు వెళ్తుంటారు. ప్రయాణికుల రద్దీ దృష్ట్యా బస్సులు నడిపేలా ఆర్టీసీ యోచిస్తోంది. మహాలక్ష్మీ పథకంతో హైదరాబాద్ నుంచి వచ్చే మహిళా ప్రయాణికులు ఇబ్బందులు పడకుండా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సులను మరింత పెంచనున్నట్లు తెలుస్తోంది.

ఈనెల 7 నుంచి 13 వరకు..

ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల, ఆసిఫాబాద్ డిపోల నుంచి ప్రత్యేక బస్సులు నడపనున్నారు. గతంలో భైంసా, ఉట్నూర్ డిపో నుంచి ప్రత్యేక బస్సులు నడిపిన ఆశించిన మేర ఆదాయం రాలేదు. ఈ ఏడాది ఈనెల 10, 11న మాత్రమే ఒక్కో బస్సు సర్వీసు నడపనుంది. అత్యధికంగా నిర్మల్ డిపో బస్సులు 88, మంచిర్యాల నుంచి 82 వరకు ఉన్నాయి. మిగిలిన ఐదు డిపోల నుంచి ఈనెల 7 నుంచి 13 వరకు బస్సులను జేబీఎస్ నుంచి గమ్యస్థానాలకు వెళ్లనున్నాయి. ఆదిలాబాద్ నుంచి 58, భైంసా-02 నిర్మల్-88 ఉట్నూర్-02, ఆసిఫాబాద్-58, మంచిర్యాల డిపో నుంచి 81 బస్సులను ఏర్పాటు చేశారు. ఈనెల 10 నుంచి ప్రయాణికుల రద్దీ పెరగనున్న నేపథ్యంలో అధిక బస్సులు నడిపేలా ఆర్టీసీ అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు.

తిరుగు ప్రయాణంలో కూడా..

సంక్రాంతి నేపథ్యంలో తిరుగు ప్రయాణంతో రద్దీ అధికంగా ఉంటుంది. హైదరాబాద్ నుంచి స్వగ్రామాలకు వచ్చి వెళ్లేవారి కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపనుంది. రద్దీకి అనుగుణంగా బస్సుల రాకపోకలు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ డిపోల నుంచి ఈనెల 15 నుంచి 20 వరకు 195 బస్సులు నడపనున్నారు. ఆదిలాబాద్ డిపో బస్సులు 31, భైంసా 4, నిర్మల్ 71, ఉట్నూర్ 1, ఆసిఫాబాద్ 38, మంచిర్యాల 50 బస్సులను తిరుగుప్రయాణానికి వెళ్లే వారి కోసం జేబీఎస్ వరకు ఆర్టీసీ బస్సులను నడపనుంది.

రద్దీకి అనుగుణంగా బస్సులు



పండుగ సందర్భంగా ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా ప్రత్యేక బస్సులు నడుపుతాం. రద్దీ ఎక్కువగా అప్పటికప్పుడు బస్సులు ఏర్పాటు చేస్తాం. ప్రత్యేక బస్సులకు సాధారణ చార్జీలే ఉంటాయి. రిజర్వేషన్ సౌకర్యం ఉంటుంది. బస్సు ఎక్కేటప్పుడు క్యూ పద్ధతి పాటించాలి. ప్రయాణికులకు జేబీఎస్ బస్‌స్టేషన్‌లో ఎప్పటికప్పుడు బస్సుల సమాచారం అందిస్తారు.

– సోలోమాన్, ఆర్‌ఎం, ఆదిలాబాద్

జేబీఎస్ నుంచి ఆదిలాబాద్ రీజియన్‌కు బస్సుల వివరాలు

తేదీ	ఆదిలాబాద్	భైంసా	నిర్మల్	ఆసిఫాబాద్	మంచిర్యాల
07	02	0	03	02	03
08	02	0	03	02	02
09	04	0	06	04	06
10	15	01	23	15	20
11	15	01	23	15	20
12	10	0	15	10	15
13	10	0	15	10	15

ఉట్నూర్ డిపో బస్సుల రాకపోకలు: ఈనెల 10, 11న బస్సు మాత్రమే రాకపోకలు సాగిస్తాయి.

తిరుగు ప్రయాణం కోసం..

తేదీ	ఆదిలాబాద్	భైంసా	నిర్మల్	ఆసిఫాబాద్	మంచిర్యాల
15	07	02	15	08	10
16	08	02	16	10	12
17	04	0	10	05	07
18	04	0	10	05	07
19	04	0	10	05	07
20	04	0	10	05	07

ఉట్నూర్ డిపో నుంచి ఈనెల 16న ఒక బస్సు మాత్రమే నడపనున్నారు.

చోరీ కేసులో మైనర్ అరెస్టు

బోథ్: చోరీ కేసులో మైనర్‌ను అరెస్టు చేసినట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండల కేంద్రంలో బస్టాండ్ వద్ద గల ఈనెల 2న సూర్యవంశీ ఉలాజీ ఇంటికి తాళం వేసి చేనుకు వెళ్లాడు. పనులు ముగించుకుని మధ్యాహ్నం ఇంటికి రాగా ఇంటి తాళం పగులగొట్టి ఉంది. ఇంట్లో తన ప్యాంటు జేబులో ఉంచిన రూ. 10 వేల నగదు కనిపించలేదు. తన ఇంటి వద్ద ఏర్పాటు చేసిన సీసీ పుటేజీని పరిశీలించారు. మైనర్ ఇంటి తాళం పగలకొట్టిన వీడియో రికార్డు అయింది. శనివారం మైనర్‌ను పట్టుకున్నట్లు ఎస్సై తెలిపారు. అతని నుంచి రూ.10 వేల నగదను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

నేడు కడెం ఆయకట్టుకు నీటి విడుదల

కడెం: కడెం ఆయకట్టు యాసంగి పంటలకు ఆదివారం నీటిని విడుదల చేయనున్నట్లు డీఈఈ నవీన్ పేర్కొన్నారు. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ ప్రాజెక్ట్ కుడి, ఎడమ కాలువలకు నీటిని విడుదల చేస్తారని తెలిపారు.

చోరీకి గురైన వస్తువులు అప్పగించాలి

బెల్లంపల్లి: గతనెల 29వ రాత్రి తనపై హత్యాయత్నం చేసి చోరీ చేసిన తన వస్తువులను తిరిగి అప్పగించాలని ఆరిజిన్ డెయిరీ సీఈవో కందిమళ్ల ఆదినారాయణ కోరారు. ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తనకు ప్రాణహాని ఉండటంతో బెల్లంపల్లి వన్‌టౌన్ ఎస్‌హెచ్‌ఓ దేవయ్యకు శనివారం వాట్సాప్ ద్వారా ఫిర్యాదు చేస్తున్నట్లు తెలిపారు. పట్టణంలో యూనియన్ బ్యాంకు వీధిలో సెలూన్ షాప్‌వద్దకు వెళ్లగా రాగం శెట్టి సతీశ్, శ్యామ్ మరో ఆరుగురు తనపై హత్యాహత్నం చేశారన్నారు. ఆ దాడిలో తన వద్ద ఉన్న సుమారు రెండున్నర తులాల బంగారు చైన్, రూ.10,500 నగదు, రెండు సెల్‌ఫోన్లు ఎత్తుకెళ్లారని పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చాలి


ఎంపికైన క్రీడాకారులతో పార్థసారథి

ఆదిలాబాద్: ఉమ్మడి జిల్లా హాకీ క్రీడాకారులు రాష్ట్రస్థాయి ఎస్జీఎఫ్ పోటీల్లో ప్రతిభ కనబర్చాలని జిల్లా గిరిజన క్రీడల అధికారి కోరెడ్డి పార్థసారథి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో శనివారం అండర్–19 ఉమ్మడి జిల్లాస్థాయి బాలుర హాకీ ఎంపిక పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హాకీలో జిల్లా ఎన్నో అత్యుత్తమ ప్రదర్శనలు ఇచ్చిందన్నారు. ఎంతోమంది క్రీడాకారులు రాష్ట్ర, జాతీయస్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహించారని పేర్కొన్నారు. వారందరి ప్రదర్శనను స్ఫూర్తిగా తీసుకొని జాతీయస్థాయి క్రీడాకారులుగా ఎదగాలని ఆకాంక్షించారు. జిల్లాస్థాయిలో ఎంపికైన క్రీడాకారులు ఈనెల 7 నుంచి నల్గొండలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని వివరించారు. సెలెక్టర్లు జె.రవీందర్, శ్రీనివాస్, అతుల్ తదితరులు పాల్గొన్నారు.

‘పది’లో ఉత్తమ ఫలితాలు సాధించాలి


మాట్లాడుతున్న డీఈవో యాదయ్య

మంచిర్యాలఅర్బన్: పదో తరగతిలో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలని డీఈవో యాదయ్య అన్నారు. మంచిర్యాల జిల్లా సైన్స్ కేంద్రంలో ఎంఈవోలు, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వందశాతం ఫలితాలు, అత్యధిక మార్కులు సాధించటానికి ప్రణాళిక రూపొందించాలన్నారు. పది పరీక్ష విధానంలో వచ్చిన మార్పులకనుగుణంగా విద్యార్థులను సన్నద్ధం చేయాలన్నారు. అపార్ కార్డు, పదో తరగతి ప్రత్యేక తరగతుల నిర్వహణ, పాఠశాల గ్రాంట్ల వినియోగం, సైబర్ కాంగ్రెస్ మొదలైన అంశాలపై సమీక్ష నిర్వహించారు. సమావేశంలో జిల్లా పరీక్షల విభాగం అదనపు కమిషనర్ దామోదర్‌రావు, సమగ్రశిక్ష కోఆర్డినేటర్లు చౌదరి, యశోధ, శ్రీనివాస్, రాజ్‌కుమార్, సత్యనారాయణమూర్తి, డీసీఈబీ అసిస్టెంట్ సెక్రెటరీ కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

చోరీకి యత్నించిన వ్యక్తి అరెస్ట్

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలో చోరీకి యత్నించిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు నిర్మల్ ఏఎస్పీ రాజేష్ మీనా తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. శనివారం తెల్లవారుజామున స్థానిక నారాయణరెడ్డి మార్కెట్‌లో గల మ్యాక్స్ మొబైల్ షాప్ తాళా న్ని ఒకరు పగులగొట్టి చోరీకి ప్రయత్నం చేస్తుండగా ఓ వ్యక్తి చూసి యజమానికి ఫోన్ చేసి చెప్పాడు. వెంటనే యజమాని పోలీసులకు సమాచారమిచ్చారు. ఎస్పీ రాజేష్ మీనా, పెట్రోలింగ్ డ్యూటీ నిర్వహిస్తున్న ఎస్సై సందీప్‌తో కలిసి ఐదు నిమిషాల్లో వెళ్లి దొంగను స్వయంగా పట్టుకున్నాడు. కేసు నమోదు చేసి, మైనర్ కావడంతో శనివారం జువైనల్ కోర్టులో ప్రవేశపెట్టగా రిమాండ్ తరలించారు. ఎస్పీ జానకీ షర్మిల ఈ సందర్భంగా ఏఎస్పీని అభినందించారు.

- పెట్రోల్ పోసుకుని వ్యక్తి ఆత్మహత్యాయత్నం
- అడ్డుకున్న పోలీసులు
- జిల్లాకేంద్రంలో ఘటన

ఇంటి నిర్మాణ పనులు అడ్డుకున్నారని..


రమేశ్ ఒంటిపై పెట్రోల్ పోసుకుంటుండగా అడ్డుకున్న పోలీసులు


కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ ఖమర్

నిర్మల్‌టౌన్: ఇంటి నిర్మాణ పనులను మున్సిపల్ అధికారులు అడ్డుకుంటున్నారని ఓ వ్యక్తి ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. జిల్లా కేంద్రంలో ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. స్థానిక సోమవార్‌పేట్‌లో శక్కరి రమేశ్ ఇంటి నిర్మాణం చేపడుతున్నాడు. దీనికి అనుమతులు లేవని టీపీవో హరీశ్ తరచూ వచ్చి వేధిస్తూ పనులు అడ్డుకుంటున్నాడు. విసుగు చెందిన కుటుంబీకులు శనివారం మున్సిపల్ కార్యాలయం ఎదుట బైఠాయించారు. పెట్రోల్ డబ్బా పట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. వీరికి మద్దతుగా స్థానిక కౌన్సిలర్ మేడారం అపర్ణ–ప్రదీప్ బైఠాయించారు. మున్సిపల్ అధికారులు అందించిన సమాచారంతో పోలీసులకు అక్కడికి చేరుకున్నారు. తమ బాధను ఎవరూ పట్టించుకోకపోవడంతో రమేశ్ ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యకు ప్రయత్నించాడు. అక్కడే ఉన్న పోలీసులు పెట్రోల్ డబ్బాను లాక్కున్నారు. తమ సమస్య పరిష్కరించకుంటే కుటుంబ సమేతంగా ఆత్మహత్య చేసుకుంటామని రమేశ్ తెలిపాడు. మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, కమిషనర్ ఖమర్ అక్కడికి చేరుకొని వారికి సర్దిచెప్పారు. అయినా రమేశ్ కొన్ని గంటలు అక్కడే బైఠాయించి నిరసన వ్యక్తం చేశాడు.

యూత్ ఫెస్టివల్ విజేతలు రిపోర్టు చేయాలి

మంచిర్యాలటౌన్: స్వామివివేకానంద జయంతి పురస్కరించుకుని రాష్ట్రస్థాయి యువజన ఉత్సవాలు జరగనున్నాయి. ఈనెల 6, 7 తేదీల్లో సికింద్రాబాద్‌లోని బోర్స్ క్లబ్స్ ట్యాంక్ బండ్, యూత్ సర్వీసెస్ హెడ్ ఆఫీస్ ఆడిటోరియంలో నిర్వహించే పోటీలకు వెళ్లే విజేతలు రిపోర్టు చేయాలని జిల్లా యువజనుల, క్రీడల శాఖ అధికారి రాజ్‌వీర్ ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో నిర్వహించిన యూత్ ఫెస్టివల్‌లో నిర్వహించిన పోటీల్లో ప్రథమస్థానంలో గెలిచి ఎంపికైన విద్యార్థులు సోమవారం ఉదయం 4 గంటలకు మంచిర్యాల బస్టాండ్‌లో రిపోర్టు చేయాలని పేర్కొన్నారు. వివరాలకు బాక్సింగ్ కోచ్ రాజేశ్ సెల్ 9963539234 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. పాల్గొనే విద్యార్థులు రెండు పాస్‌ఫొటోలు, ఆధార్ కార్డు, ఏజ్ ప్రూఫ్ సర్టిఫికేట్, బోనాఫైడ్, ఎస్సెస్సీ మెమో జిరాక్స్‌లతో హాజరుకావాలని తెలిపారు.

ఎంపికైన వారి వివరాలు..

పోయెట్రీలో బి.శ్రీవల్లి, స్టోరీ రైటింగ్‌లో ఏ.అంజలి, పెయింటింగ్‌లో ఏ.వర్ష, సైన్స్‌ఫేర్‌లో ఇన్నా తస్లీమ్, టి.అమూల్య, గ్రూప్ ఫోక్‌డాన్స్‌లో విష్ణుప్రియ, ఎస్.అక్షయ, స్నేహితవర్మ, ఈ.అక్షయ, భవ్య, అలేఖ్య, హర్షిని, వైశాలి, శ్వేత, కె.శృతి, గ్రూప్ ఫోక్ డ్యాన్స్ జె.మౌనిక, డి.మాలతి, బి.కాంతి, దీక్షిత, డిక్లమేషన్‌లో ఆర్.సౌమ్య, ఏ.లిఖిత ఎంపికయ్యారు.

ఐదుగురు బైండోవర్

సిర్పూర్(టి): పశువుల అక్రమ రవాణాలో పట్టుబడిన ఐదుగురిని తహసీల్దార్ శ్రీనివాస్ ఎదుట శనివారం బైండోవర్ చేసినట్లు ఎస్సై కమలాకర్ తెలిపారు. వీరిలో రాజేందర్, సతీశ్, సారయ్య, అఫ్జల్, భాస్కర్ ఉన్నారు. పశువుల అక్రమ రవాణాకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని ఎస్సై హెచ్చరించారు.

పేకాటస్థావరంపై దాడులు

దహెగాం: ఎస్పీ డీవి శ్రీనివాస్ ఆదేశాల మేరకు మండలంలోని ఇట్యాల శివారులో పేకాటస్థావరంపై శనివారం దాడులు నిర్వహించినట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ రాణాప్రతాప్ తెలిపారు. పక్కా సమాచారంతో దాడి చేసి పేకాట ఆడుతున్న ఐదుగురిని అదుపులో తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఏడుగురు పరారీలో ఉన్నారని తెలిపారు. పేకాట ఆడుతున్న వారి నుంచి నుంచి రూ.35,320 నగదుతోపాటు 5 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని దహెగాం పోలీసుస్టేషన్‌లో అప్పగించామన్నారు. టాస్క్‌ఫోర్స్ ఎస్సై వెంకటేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

14 నుంచి జుగ్నాక్ వంశీయుల పెర్సపేన్ పూజలు


సమావేశమైన జుగ్నాక్ వంశీయులు

ఇంద్రవెల్లి: మండలంలోని పొల్లుగూడ గ్రామంలో ఈనెల 14 నుంచి పెర్సపేన్ పూజలు నిర్వహించనున్నట్లు జుగ్నాక్ వంశం కటోడ(పూజారి) జుగ్నాక్ మహాదు అన్నారు. గ్రామంలో శనివారం ఉమ్మడి జిల్లా జుగ్నాక్ వంశం పెద్దలతో ఆయన సమావేశమయ్యారు. పూజల నిర్వహణ గురించి చర్చించారు. 15న పెర్సపేన్ పూజలు నిర్వహించి గ్రామం చుట్టూ ప్రదక్షిణ చేస్తారని తెలిపారు. 16న కుల దేవతకు పుణ్యస్నానం ఆచరించడంతోపాటు అదేరోజు రాత్రి మహాపూజ ఉంటుందని పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లా జుగ్నాక్ వంశీయులు అధికసంఖ్యలో పాల్గొనాలని కోరారు. జుగ్నాక్ వంశీయులు జుగ్నాక్ కాశీరాం, మానిక్‌రావ్, భారత్, జాలింరావ్, గ్రామపెద్దలు ఆత్రం శంకర్, భుజంగ్‌రావ్, కొరెంగా జుగాదిరావ్, మర్సుకోల నాందేవ్ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన విద్యనందించాలి

- ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా


విద్యార్థినులతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో

ఉట్నూర్‌రూరల్: ఆశ్రమ పాఠశాలల విద్యార్థినులకు మెరుగైన విద్యనందించాలని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా పేర్కొన్నారు. మండల కేంద్రంలోని బాలికల ఆశ్రమ పాఠశాలను శనివారం అకస్మికంగా తనిఖీ చేశారు. ఉపాధ్యాయుల హాజరుపట్టిక, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. విద్యాబోధన తీరు గురించి పదో తరగతి విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. రక్త నత అరికట్టేలా విటమిన్ ‘సీ’టాబ్లెట్లు ఇవ్వాలన్నారు. మొవా లడ్డూ, గుడ్లు, పాలు, రాగి మాల్టా అందించాలన్నారు. హెచ్‌ఎం, ఉపాధ్యాయులు ఉన్నారు.

గిరిజన పోషణ మిత్ర పథకం ప్రారంభం

ఉమ్మడి ఆదిలాబాద్ ఐటీడీఏ పరిధిలోని 60 ఆశ్రమ బాలికల పాఠశాలలు, వసతి గృహాల్లో గిరిజన పోషణ మిత్ర పథకాన్ని ప్రారంభిస్తున్నట్లు ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా ఓ ప్రకటనలో తెలిపారు. పథకం అమలుకు ప్రత్యేక అధికారులను నియమించనున్నట్లు తెలిపారు. వారంలో రెండు సార్లు ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలు సందర్శించి నివేదికను పీవోకు అందిస్తారని పేర్కొన్నారు. విద్యార్థినులు రక్తహీనత బారినపడకుండా ఇప్పపువ్వు లడ్డూ, విటమిన్ ‘సీ’, ఐరన్ మాత్రలను ప్రతీ వారం రెండు సార్లు అందిస్తారని తెలిపారు. ఐటీడీఏ ఉద్యాన నర్సరీల్లో పెంచిన కరివేపాకు, మునగ తదితర మొక్కలను ఉచితంగా పంపిణీ చేస్తారని పేర్కొన్నారు.

‘గిరిజన పోషణమిత్ర’ పకడ్బందీగా అమలు చేయాలి

నార్నూర్: గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో గిరిజన పోషణ మిత్ర పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ఐటీడీఏ హార్టికల్చర్ అధికారి సందీప్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని జామడ, నార్నూర్ బాలికల ఆశ్రమ పాఠశాలలను శనివారం ఆయన సందర్శించారు. పాఠశాలలో రికార్డులు, వంట గదులను పరిశీలించారు. విద్యార్థినులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఉపాధ్యాయులతో సమావేశమై సమస్యలపై ఆరా తీశారు. మహువా లడ్డూతోపాటు విటమిన్ సి మాత్రలను వారంలో రెండుసార్లు విద్యార్థినులకు అందిస్తారన్నారు. పాఠశాలల్లో కిచెన్ గార్డెన్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. హెచ్‌ఎంలు చౌహాన్ వందన, విట్టల్, వార్డెన్ వనిత పవార్, ఆరోగ్య సిబ్బంది ఉన్నారు.

9న జాబ్‌మేళా

ఉట్నూర్‌రూరల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 9న ఉదయం 10 గంటలకు జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ప్రతాప్‌సింగ్ ఓ ప్రకటనలో తెలిపా రు. హైదరాబాద్‌లోని గ్రాన్యూల్స్ ఫార్మా కంపెనీలో ఒక జూనియర్ కెమిస్ట్ పోస్టుకు ఇంటర్వ్యూ ఉంటుందని పేర్కొన్నారు. 2023–24లో ఇంటర్ ఎంపీసీ/బైపీసీ పూర్తయి, కెమిస్ట్రీ సబ్జెక్టుతో డిగ్రీ చదువుతున్న ఉమ్మడి జిల్లా విద్యార్థులు పాల్గొనాలని కోరారు. ఇందులో ఎంపికైనవారికి ఏడాదికి రూ.2.05 లక్షల జీతం ఉంటుందని పేర్కొన్నారు. శిక్షణలో ఉచిత హాస్టల్, భోజన వసతి కల్పిస్తారని తెలిపారు. వివరాలకు సెల్ 9885762227 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

నీల్వాయిలో బర్డ్‌వాక్


బర్డ్‌వాక్ నిర్వహిస్తున్న అధికారులు

వేమనపల్లి: నీల్వాయి ప్రాజెక్టు పరిసరాల్లోని అటవీ ప్రాంతంలో శనివారం సాయంత్రం బర్డ్‌వాక్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇక్కడ ఎన్నో వైవిధ్యమైన పక్షి జాతులు ఉన్నట్లు రిసోర్స్‌పర్సన్ రాంజాన్ విరాని గుర్తించారు. వాటి సంరక్షణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. నీల్వాయి ప్రాజెక్టు పరిసరాలు అరుదైన పక్షులకు నిలయమని నీల్వాయి, చెన్నూర్ అటవీ రేంజర్లు అప్పలకొండ, శివకుమార్ తెలిపారు. డీఆర్వోలు ప్రమోద్‌కుమార్, ఎఫ్‌ఎస్‌ఓలు, ఎఫ్‌బీఓలు పాల్గొన్నారు.

ధర్నా జయప్రదం చేయండి


మాట్లాడుతున్న లంకా రాఘవులు

ఎదులాపురం: వ్యవసాయ కూలీలకు కూలీబంధు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఈనెల 6న కలెక్టరేట్ వద్ద చేపట్టే ధర్నాను జయప్రదం చేయాలని రాష్ట్ర ఉపాధ్యక్షుడు లంకా రాఘవులు పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలో సుందరయ్య భవనంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రప్రభుత్వం వ్యవసాయ కూలీలకు కూలీబంధు అమలు చేయాలని, గ్రామసభలో అర్హులైన కూలీలను ఎంపిక చేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కూలీలు ఈ ధర్నాలో అధికసంఖ్యలో పాల్గొనాలని కోరారు. సంఘం జిల్లా అధ్యక్షుడు స్వామి, నాయకులు ఆశన్న, కిష్టన్న, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.